

పాము కాటుతో రైతు మృతి

తానూర్, మార్చి 25 : మండలంలోని బామ్ని తండాకు చెందిన జాదవ్ గణేష్(58) అనే రైతు పాము కాటుతో మృతి చెందాడు. వివరాల ప్రకారం... మృతుడు గణేష్ సోమవారం సాయంత్రం 3 గంటలకు తన ఇంట్లో ప్రమాదవశాత్తు విషపూరితమైన పాము కాటు వేయగా, చికిత్సకు భైంసా ఏరియాసుపత్రికి తరలించగా మరణించినట్లు ఎస్సై నందీప్ తెలిపారు. మృతుడి కూతురు అనితాబాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కడెం ప్రాజెక్టుపై కదిలిన సర్కారు





కడెం ప్రాజెక్టు ఇదే



ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

- ప్రాజెక్టు విద్యుద్దీకరణకు రూ. 3.81 కోట్లు విడుదల
- ఇప్పటికే రూ. 5 కోట్లతో మొదలైన మరమ్మతు పనులు
- మూడు గేట్లకు ఓ కంట్రోల్ ప్యానెల్ ఏర్పాటు
- వరద అంచనాలకు ప్రత్యేకంగా సెన్సర్లు
- 11 కేవీ లైన్ అనుమతులపై సందేహాలు
- మంత్రి సీతక్క చొరవతో మహర్దశ

నిర్మల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే మొన్నటి బీఆర్ఎస్ ప్రభుత్వం కడెం ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేయగా ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతోంది. ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ ప్రసిడెంట్, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి కడెం ప్రాజెక్టును ఆధునీకరిస్తామంటూ హామీనిచ్చారు. దానికి అనుగుణంగా ఆయన వరుసగా ప్రాజెక్టు మరమ్మతులు, ఇతర పనుల కోసం నిధులు విడుదల చేస్తుండడం పట్ల ఆయకట్టు రైతాంగం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది. కొద్దిరోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో కలిసి మంత్రి సీతక్క కడెం ప్రాజెక్టును సందర్శించి మరమ్మతు పనుల కోసం నిధులు మంజూరు చేస్తానంటూ కూడా హామీనిచ్చారు. ఆ హామీకి అనుగుణంగా వారం రోజుల్లోనే రూ.5 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. అయితే ప్రతీఏటా వరద సమయంలో ప్రాజెక్టు గేట్లను ఎత్తడం, కిందికి దించడం ఓ సమస్యగా మారింది. ఈ గేట్ల నాణ్యత ప్రస్తుతం దెబ్బతింది. ఈ గేట్లకు మరమ్మతులు కొనసాగుతున్నప్పటికీ వరదసమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతున్న కారణంగా గేట్లను పైకి ఎత్తడం, కిందికి దించడం సాధ్యం కావడం లేదు. ఇక్కడ ఉన్న జనరేటర్ కేవలం 100 కిలోవాట్స్ కెపాసిటీతో ఉన్నందున గేట్లను పైకి ఎత్తడం కిందికి దించడం ఆలస్యమవుతోంది. ఇంతలోనే వరద తన ప్రతాపాన్ని చూపెడుతుండడం సహజంగా మారుతుంది. అయితే ప్రాజెక్టు కెపాసిటీకి అనుగుణంగా ఇక్కడ గేట్లు పని చేయకపోతుండడంతో ప్రమాదం ముంచుకోస్తోంది. కరెంటు సరఫరా నిలిచిపోతున్నప్పటికీ గేట్లను పైకి ఎత్తడం, కిందికి దించడం జనరేటర్‌ల వల్ల జరుగుతోంది. ఇక్కడ కేవలం 100 కిలోవాట్ సామర్థ్యం గల జనరేటర్‌ను అలాగే 11 కేవీ విద్యుత్‌లైన్‌తో పాటు 500 కిలోవాట్ల కెపాసిటీ గల ప్రత్యేక టాన్స్‌ఫార్మర్ ఇక్కడ ఏర్పాటు చేయాలంటూ ప్రాజెక్టు అధికారులు చాలారోజుల క్రితమే ప్రతిపాదనలు రూపొందించారు. అయితే దీని కోసం అవసరమయ్యే నిధులను అప్పటి ప్రభుత్వాలు మంజూరు చేయకపోతుండడంతో ప్రతీఏటా గేట్ల సమస్య ప్రాజెక్టు మనుగడకే ప్రమాదంగా మారింది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు కడెం ప్రాజెక్టు విద్యుద్దీకరణ పనుల కోసం రూ.3.81 కోట్లను విడుదల చేస్తూ మూడు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగైదు రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులన్నింటినీ వేసవి ముగిసేలోగా పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. విద్యుద్దీకరణ పనులన్నీ పూర్తయితే ఇక ప్రతీఏటా ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వచ్చే వరద ఉధృతిని ఎప్పటికప్పుడు రికార్డు చేసేందుకోసం సెన్సర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవలే మంజూరైన రూ.5 కోట్ల నిధులతో ప్రస్తుతం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. వరద గేట్లు, రూలర్స్, రబ్బర్‌సీల్స్ అలాగే మోటార్‌ల మరమ్మతులు, కౌంటర్ వేటర్‌ల ఏర్పాటు లాంటి పనులు చేపడుతున్నారు. ప్రాజెక్టు స్పిల్ వే రక్షణ, గోడల పనులను కూడా నిర్వహిస్తున్నారు.

కీలకం కానున్న అనుమతులు

కాగా కడెం ప్రాజెక్టు కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉంటుంది. ఈ ప్రాంతంలో 11 కేవీ విద్యుత్ తీగల ఏర్పాటు చేయాలంటే కేంద్ర అటవీ పర్యావరణశాఖ అనుమతులు తప్పనిసరి అవుతాయని అంటున్నారు. ప్రాజెక్టును నిర్మించి దాదాపు 60 సంవత్సరాలు అవుతున్నప్పటికీ అప్పట్లో ఏర్పాటు చేసిన విద్యుత్ వ్యవస్థతోనే ఇప్పటి వరకు అన్ని రకాల పనులను నెట్టుకొస్తున్నారు. అయితే ఇక్కడ విద్యుత్ వైరింగ్‌తో పాటు ప్యానెల్ బోర్డ్స్, లైటింగ్ వ్యవస్థ దెబ్బతిన్నాయి. మొత్తం ప్రాజెక్టుకు సంబంధించిన 18 గేట్లను ఆపరేటింగ్ చేసేందుకు దాదాపు 500 కిలోవాట్ కెపాసిటీ గల టాన్స్‌ఫార్మర్ అవసరం ఉంటుంది. అయితే ప్రస్తుతానికి ఇక్కడ కేవలం 100 కిలోవాట్ల కెపాసిటీ గల టాన్స్‌ఫార్మర్ మాత్రమే ఉండడం, అదే టాన్స్‌ఫార్మర్‌తో గేట్లను ఆపరేటింగ్ చేస్తుండడం సమస్యగా మారుతుంది. జనరేటర్ టాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు అనుమతుల వ్యవహారం స్థానిక యంత్రాంగం పరిధిలోనే ఉంటున్నప్పటికీ 11 కేవీ లైన్ ఏర్పాటు వ్యవహారం మాత్రం అటవీశాఖ పరిధిలో ఉంటుందని చెబుతున్నారు. కవ్వాల్ అభయారణ్యం కారణంగా అనుమతులు ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ 160 కిలోవాట్ల జనరేటర్ ఏర్పాటు అలాగే 500 కిలోవాట్‌ల కెపాసిటీ గల టాన్స్‌ఫార్మర్ ఏర్పాటుట పనులను అలాగే నాణ్యమైన కేబుల్స్, ప్యానెల్‌బోర్డ్స్, లైటింగ్ సిస్టంను కొత్తగా చేపట్టాల్సి ఉంటుంది.

గేట్లకు కంట్రోల్ ప్యానెల్ ఏర్పాటు

వరద సమయంలో ప్రాజెక్టు గేట్లను పైకి ఎత్తడం, కిందికి దింపడం కోసం కరెంటు సరఫరా తప్పనిసరి అవుతుంది. అయితే ఈదురు గాలులు, భారీ వర్షాలు, వరద ఉధృతికి కరెంటు సరఫరా నిలిచిపోయినట్లయితే వెంటనే జనరేటర్ ద్వారా కరెంటును గేట్లకు అందే విధంగా చర్యలు తీసుకోబోతున్నారు. దీని కోసం గానూ సింక్రోనైజింగ్ ప్యానెల్‌లను ఏర్పాటు చేసి మొత్తం 18 గేట్లను ఆపరేట్ చేయనున్నారు. దీని కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికీ జనరేటర్ ద్వారా కరెంటు సరఫరా జరగనుండడంతో గేట్లను పైకి ఎత్తడం, కిందికి దింపడం సులభమవుతుందని అంటున్నారు. అలాగే కడెం గ్రామానికి, ప్రాజెక్టుకు వేరు వేరుగా విద్యుత్‌ను ఏర్పాటు చేయనున్నారు.

మంత్రి సీతక్క చొరవతోనే..

కాగా దశాబ్దాల కాలం నుంచి నిర్లక్ష్యానికి గురైన కడెం ప్రాజెక్టును స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జు చొరవతో సందర్శించిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆ ప్రాజెక్టుకు పూర్వవైభవం కల్పించాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగానే మొదటిసారి ఆమె ప్రాజెక్టును సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మతు పనులకు ఎంతమేరకు నిధులు అవసరమవుతాయోనని అడిగి తెలుసుకున్నారు. అయితే అధికారులు అప్పటికే గేట్ల మరమ్మతులతో పాటు కౌంటర్‌వేటర్‌లు, రూఫ్‌లు, రోలర్‌లు, తదితర వాటికి రూ.5 కోట్లతో అంచనాలు రూపొందించామని, దానికి సంబంధించిన ప్రతిపాదనలు సర్కారు వద్ద పెండింగ్‌లో ఉన్నాయంటూ ఇంజనీరింగ్ అధికారులు మంత్రికి వివరించారు. దీంతో హైదరాబాద్ వెళ్లిన మంత్రి ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రాజెక్టు మరమత్తుల కోసం ప్రభుత్వం ద్వారా రూ.5 కోట్లను విడుదల చేయించారు. అలాగే మరికొద్ది రోజుల్లోనే ప్రాజెక్టు విద్యుద్దీకరణ పనుల కోసం రూ.3.80 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేయించారు. దీని కారణంగా ప్రాజెక్టు గేట్లతో పాటు లైటింగ్, జనరేటర్, టాన్స్‌ఫార్మర్స్, 11 కేవీ లైనింగ్ లాంటి సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైంది. ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, మంత్రి సీతక్కల ప్రత్యేక చొరవతోనే నిధులు మంజూరు కావడం, ప్రాజెక్టు పూర్వవైభవం సాధించే దిశగా రూపుదిద్దుకోవడం జరుగుతోందంటున్నారు.

సంబురంగా.. హోలీ



రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



నర్సాపూర్(జి) మండల కేంద్రంలో..

- ఉత్సాహంగా పాల్గొన్న పిల్లలు, పెద్దలు
- డ్యాన్స్, పాటలతో యూత్ సందడి

నిర్మల్ కల్చరల్, మార్చి 25 : జిల్లాలో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఉత్సాహంగా రంగుల పండగలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధానవీధులు, అపార్ట్‌మెంట్లు, కూడళ్ల వద్ద రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. యూత్, పిల్లలు స్నేహితులతో కలిసి హోలీ పండగ జరుపుకున్నారు. కేరింతలు కొడుతూ సహజసిద్ధమైన రంగులు చల్లుకున్నారు. చిన్నారులు వాటర్ గన్స్‌తో రంగులు పూసు కుంటూ స్నేహితులతో గడిపారు. సామూహికంగా జరుపుకొని జీవితంలో వసంతకేళి కొత్తదనం తీసుకురావాలని ఆకాంక్షిస్తూ సప్తవర్ణాలను పులుము కున్నారు. ఆదివారం రాత్రి కామదహనంతో ప్రారంభమైన హోలీ పండగ సోమవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్, బుధవార్‌పేట్, శాస్త్రినగర్, ఈద్గామ్, భాగ్యనగర్, ప్రియదర్శినినగర్, ఇంద్రానగర్ తదితర ప్రాంతాల్లో హోలీ సంబరాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున కుటుంబాలు పాల్గొన్నాయి. రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జిల్లాకేంద్రంతో పాటు ఖానాపూర్, భైంసా డివిజన్ పరిధిలోని గ్రామాల్లో హోలీ వేడుకలు జరుపుకున్నారు. యూత్ డీజే పాటలకు డ్యాన్సులు చేస్తూ, పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు. ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ వీధుల్లో తిరిగి రంగులు చల్లుకుని హంగామా చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో అట్టహాసంగా వేడుకలు జరుపుకున్నారు. ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సిబ్బందితో కలిసి రంగులు చల్లుకున్నారు. టీఎన్జీవో కార్యాలయంలో ఉద్యోగులు హోలీ వేడుకలు ఘనంగా జరుపుకొని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఏఎంఆర్ అపార్ట్‌మెంట్‌లో మహిళలు రంగులు చల్లుకున్నారు. మైత్రినగర్‌లో యూత్ సందడి చేశారు. పలుచోట్ల చిన్నారులు రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు. పలు రాజకీయ పార్టీ నాయకులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, యువకులు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం డీజే హోలీ పాటలపై నృత్యాలు చేశారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని జాం, బీరవెల్లి, మలక్ చించోలి, వంజర్ గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం ఘనంగా హోలీపండగను నిర్వహించారు. అనంతరం హిందువులకు ముస్లింలు హోలీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మలక్ చించోలిలో హోలీ పండగను పురస్కరించుకొని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీల పోటీలను నిర్వహించారు. బహుమతులను అందజేశారు.

భైంసా : డివిజన్‌వాసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్న, పెద్ద అనే వయస్సుతో బేధం లేకుండా అందరు రంగులు చల్లుకుంటూ,పూసుకుంటూ వేడుకలను ఆనందోత్సహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు.

ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ హోలీ సంబరాల్లో మునిగి తేలారు. భైంసాలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ఆయా ప్రాంతాలవాసులకు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

సహజ సిద్ధమైన రంగులకే ప్రాధాన్యతనిచ్చిన ప్రజలు

ముథోల్ : మండల కేంద్రంతో పాటు చించాల, వెంకటాపూర్, తరోడా, కారేగాం, ఆష్ట, సరస్వతినగర్, ముద్గల్, తదితర గ్రామాల్లో సోమవారం హోలీ సంబరాలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సంవత్సరం ఆయా గ్రామాల్లో హోలీ వేడుకలకు రసాయన రంగులకన్నా సహజ సిద్ధమైన రంగులకే ప్రజలు ప్రాధాన్యతనిచ్చారు.

తానూర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు.

కుభీర్ : రంగుల పున్నమి హోలీని మండల వాసులు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. మండల కేంద్రం కుభీర్‌తో పాటు ఆయా గ్రామాల్లో హోళిని పురష్కరించుకొని చిన్నలు, పెద్దలు రంగులు పూసుకున్నారు.

కుంటాల : మండల కేంద్రం కుంటాలతో పాటు మండలంలోని గ్రామాల్లో సోమవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. యువకులు, పెద్దలు, చిన్నారులు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



తానూర్ మండలం కోలూర్‌లో..



కుంటాలలో హోలీ సంబరాల్లో విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో



భైంసాలో హోలీ ఆడుతున్న యువకులు



హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ తదితరులు

సంక్షిప్త సమాచారం

ప్రమాదవశాత్తు
వాగులో పడి వృద్ధుడు మృతి



సారంగాపూర్, మార్చి 25 : మండలంలో గల మలక్ చించోలి గ్రామ సమీపంలో గల స్వర్ణవాగులో ప్రమాదశాత్తు పెద్ద ఎర్రన్న (64) పడి మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్వర్ణవాగు వైపు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడడంతో ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల మండల స్థాయి సమావేశం

ముథోల్, మార్చి 25 : ముథోల్ మండల కేంద్రంలోని పశుపతినాథ్ శివాలయం ఆవరణలో మంగళవారం ముథోల్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల మండల స్థాయి సమావేశం జరుగనున్నట్లు టీజేఏసీ నియోజకవర్గ నాయకులు రోళ్ల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కావునా మండలంలోని అన్ని గ్రామాల్లో గల ఉద్యమకారులందరూ సకాలంలో రావాలని కోరారు. ఇట్టి కార్యక్రమానికి టీజేఏసీ జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు వస్తున్నట్లు వివరించారు.

పర్యవేక్షణలోపం.. ప్రజలకు శాపం

నర్సాపూర్(జి), జనవరి 3 మండల కేంద్రంలోని డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాల వద్ద చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించే అధికారి లేకపోవడంతో నాసిరకం ఇసుకతో సీసీ రోడ్డు పనులు కాంటాక్టర్ చేపడుతున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు చేసే సమయంలో పర్యవేక్షణ అధికారి తద్వర్యంలో పనులు కొనసాగే విదంగా చూడాలని ఇసుక, సిమెంట్ నాణ్యతను పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు



దిలావర్‌పూర్, మార్చి 25 : మండలంలోని కాల్వ గ్రామంలో నిర్మించిన ఆలయంలో శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. మూడు రోజులపాటు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం శ్రీ గోవిందమాంబ సహిత వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం ప్రతిష్ఠించనున్నట్లు కాల్వ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ పుజారం మహేష్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పోలీసు వేషధారణలో వచ్చి ఫోన్ల దొంగతనం

● కడెం మండలంలో దొంగ వినూత్న ప్రయత్నం ● పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

ఖానాపూర్, మార్చి 25 : దొంగతనం చేసేవారికి ఎక్కడ ఎవరి కంట పడతామో... ఎవరు పట్టుకుని పోలీసులకు అప్పగిస్తారోననే భయం ఉంటుంది. దీంతో ఎవరి కంట పడకుండా గుట్టుచప్పుడు కాకుండా ఎవరు లేని సమయాన్ని చూసుకుని దొంగలు అదును చూసి దొంగతనానికి పాల్పడుతూ ఉంటారు. కానీ ఇదంతా ఎందుకు అనుకున్నాడో ఏమో గాని ఇక్కడ ఓ దొంగ మాత్రం ఏకంగా తాను దొంగతనం చేసేందుకు రాజ మార్గాన్ని ఎంచుకున్నాడు. పోలీసు వేషాన్ని ధరించి ఫోన్లను దొంగతనం చేశాడు. వివరాల్లోకి వెళ్తే కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం... కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన రాజు అనే 24 ఏళ్ల యువకుడు హుజురాబాద్ వద్ద తన మిత్రుడైన ఓ కానిస్టేబుల్ వద్ద పోలీసు డ్రెస్ తీసుకున్నాడు. అప్పుడప్పుడు పోలీసు డ్రెస్ తీసుకొని వేసుకొని తిరిగి అతనికి ఇచ్చేస్తూ ఉండేవాడు. అలాగే ఈసారి కూడా పోలీసు డ్రెస్ తీసుకున్న రాజు రెండు రోజుల క్రితం నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మొర్రిగూడెంలోని వారి బంధువుల ఇంటికి వచ్చాడు. కాగా పోలీసు వేషధారణలో వచ్చి ఆదివారం రాత్రి మండలంలోని కొండకూరు గ్రామంలో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో ఓ మొబైల్ ఫోన్ దొంగిలించాడు. అక్కడి నుండి వచ్చి లక్కీ దాబాలో మొబైల్‌ఫోన్ దొంగతనం చేస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. పోలీసు డ్రెస్‌లో వెళ్లి ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న సదరు రాజును పట్టుకొని లక్కీ దాబా వద్ద తాళ్లతో కట్టి ఉంచారు. సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పోలీసు వేషధారణలో దొంగతానికి వచ్చిన రాజు



ఇచ్చోడలో ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు

ఈ సమస్యకు పరిష్కారం ఎన్నడో?!

ఇచ్చోడ, మార్చి 25: ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నుంచే ఇళ్లల్లోని వాడుక నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలో వాడుకనే నీరు రోడ్లపై ఏరులై పారుతుంది. ఏళ్ల తరబడి ఈ సమస్య గ్రామప్రజలను వేదిస్తున్న అధికారులు, గ్రామ పంచాయితీ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిపై మురుగు నీరు పారుతుండడంతో ఇటు వాహనదారులు, అటు పాదాచారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులను ఏదుర్కోవాల్సి వస్తోంది. ప్రధాన రహదారిపై మురుగునీరు పారుతున్న అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

పండుగ పూట విషాదం

● వాగులో పడి బాలుడి మృతి

మావల, మార్చి 25: హోలీ పండుగ పూట విషాదం నెలకొంది. వాగులో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన ఆదిలాబాద్ మండలంలోని భీంసరిలో జరిగింది. ఆదిలాబాద్ రూరల్ ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ పట్టణంలోని జై జవాన్‌నగర్‌కు చెందిన గుమ్మల సాత్విక్(14) అనే బాలుడు హోలీ పండుగ వేడుకల్లో స్నేహితులతో ఉత్సాహంగా పాల్గొన్నాడు. వేడుకల అనంతరం స్నేహితులతో కలిసి భీంసరి వాగుకు వెళ్లారు. ఈ క్రమంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు వాగులో మునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వామ్మో పులి!

తాంసి, మార్చి 25: మండలంలోని అట్నంగూడ గ్రామ సమీపంలో సోమవారం రాత్రి సమయంలో పులి అరుపులు వినిపించినట్లు అక్కడి గిరిజనులు పేర్కొన్నారు. లింబగూడ, అట్నంగూడ, గ్రామాలు అటవీ ప్రాంతానికి అనుకుని ఉండటం వల్ల ఈ పులి అరుపులు వినిపించాయని తెలిపారు. ఇదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి ఉండటంతో పులి అరుపులు వినిపించినట్లు అక్కడి గ్రామాల గిరిజనులు తెలిపారు. అది పులి అని అంటున్నారు. ఆ అరుపులు పులివేనని అంటున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తమను రక్షించాలని అక్కడి గిరిజనులు కోరుతున్నారు.

ఉదారతను చాటిన సురేందర్‌రెడ్డి

జైనథ్, మార్చి 25: జైనథ్ మండలంలోని కామాయి గ్రామానికి చెందినజైనథ్ మార్కెట్ డైరెక్టర్ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి-పద్మారెడ్డి దంపతులు సోమవారం తమ మనువరాలి పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని 50 కుటుంబాలకు టిఫిన్ డబ్బాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి తనవంతు అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీజారెడ్డిలతో పాటు కామాయి గ్రామ మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

● రంగులమయంగా మారిన పల్లెలు

తలమడుగు, మార్చి 25: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఘనంగా హోలీ సంబరాలను నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు రంగులు చల్లుకుంటు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా రాజకీయ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు, పార్టీలకు అతీతంగా హోలీ రంగుల పండుగను జరుపుకున్నారు. తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రకాష్‌రావు, కలిసి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌కు పండుగ శుభాకాంక్షలు తెలియజేసి రంగులు చల్లారు. అదే విధంగా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో విజయ డెయిరి మాజీ చైర్మన్ లోకభూమారెడ్డి తన స్వగృహంలో హోలీ పండుగ వేడుకలను గ్రామస్థులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. అంతేకాకుండా ఉదయం గ్రామ మాజీ సర్పంచ్, గ్రామస్థులు లోకభూమారెడ్డికి రంగులు పూసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి మాట్లాడుతూ తన స్వగ్రామం రుయ్యాడిలో గ్రామస్థులు అందరూ ఆనందోత్సాహాలతో హోలీ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని అన్నారు.

ఇచ్చోడ: ఉల్లాసం, ఉత్సాహాల మధ్య చిన్నా.. పెద్ద తేడా లేకుండా సోమవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. పల్లె పట్టణం అంతటా హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఇచ్చోడ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని రంగులు ఆడుతూ.. సంతోషంగా గడిపారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో జీసీడీఓ మెస్రం ఛాయా విద్యార్థులతో కలిసి రంగులు ఆడారు.

హోలీ వేడుకల్లో ఎంపీ సోయం బాపూరావు

బోథ్: ఎంపీ సోయం బాపూరావు సోమవారం హోలీ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాజు యాదవ్‌తో పాటు దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జి.వి.రమణ, ఎంపీకి రంగులు చల్లి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎ ంపీ హోలీ శుభాకాంక్షలు తెలిపి రంగులు చల్లారు. వారి వెంట బోథ్ మండలంలోని మర్లపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు తుకారం అనిల్‌లు ఉన్నారు. కాగా, బోథ్ మండలంలోని ఆదివాసులు సాంప్రదాయ రైతులు హోలీ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగాఇ ఆదివాసీ కూలీలను సాంప్రదాయబద్ధంగా డోలు వాయిస్తూ నృత్యాలు చేస్తూ ఆదివాసులు ఉన్నారు. మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో ఆదివాసి ప్రజలు పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

జైనథ్: జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్, కూర, దీపాయిగూడ, గిమ్మా తదితర గ్రామాలతో పాటు మండల కేంద్రమైన జైనథ్‌లో సోమవారం జరిగిన హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఒకరి ఒకరు రంగులను పూసుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాస్త్రయంగా కామదహనాన్ని నిర్వహించారు. ప్రజలు పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతున్ని వేడుకున్నారు. పలు గ్రామాల్లో హోలీ పండుగ జరిగిన కార్యక్రమంలో జైనథ్ ఎంపీపీ ఎం.గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుందతివెంకట్‌రెడ్డి,జైనథ్ సర్పంచ్ దేవన్నలతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండలంలో హోలీ పండుగ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే తమతమ కాలనీలలో చిన్నా, పెద్ద లేకుండా చిన్నారులు, పెద్దలు, మహిళలు, యువతి యువకులు రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుని హోలీ పండుగలో పాల్గొన్నారు. కాలనీలు, రోడ్లు రంగులమయం అయ్యాయి. నాయకులు ఒకరికి ఒకరు రంగులు చల్లి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మావల: మావల, ఆదిలాబాద్ రూరల్ మండలంలోఆయా గ్రామాల్లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో డప్పు చప్పుళ్ళ మధ్య ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. యువకులు ప్రత్యేకంగా నృత్యాలు చేఉశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు రంగులు పూసుకుని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా యువతులు, మహిళలు సైతం హోలీ వేడుకల్లో పాల్గొని ఆందనోత్సవాల్లో మునిగి తేలారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంపీపీ గంద్రత్ రమేష్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, గ్రామాల ప్రజలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని, భీంపూర్, దన్నోరా, బెల్సారి రాంపూర్, వడూర్, అర్లి(టి) అంతర్‌గామ్, గాముత్రి, కరంజితో పాటు తదితర గ్రామాలలో సోమవారం హోలీ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

తాంసి: మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఉదయం నుంచి ముఖ్యంగా చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. పార్టీలకతీతంగా ఈ వేడుక నిర్వహించారు. రంగు రంగుల చల్లడంతో పాటు ఉట్టి కుట్టే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కప్పర్ల, పొన్నారి గ్రామంలో యువకులు సైతం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు.



ఇచ్చోడ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో హోలీ వేడుకలు జరుపుకుంటున్న జీసీడీఓ మెస్రం ఛాయా



తలమడుగు మండలం రుయ్యాడిలో మాజీ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రామస్థులు



తాంసిలో హోలీ ఆడుతున్న చిన్నారులు



గుడిహత్నూర్‌లో హోలీ ఆడుతున్న పిల్లలు



కేసు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

సుంకిడి అయ్యప్ప ఆలయంలో చోరీ

తలమడుగు, మార్చి 25: మండలంలోని సుంకిడి గ్రామంలోని హరిహర క్షేత్ర అయ్యప్ప మందిరంలో సోమవారం ఉదయం 10గంటల సమయంలో మహారాష్ట్రలోని మండవ గ్రామానికి సంబంధించిన దొడీవార్ రాజేశ్వర్ అనే వ్యక్తి మందిరంలో ప్రవేశించి, భక్తులు కానుకలు సమర్పించుటకు పెట్టిన హుండీ దొంగలించి పారిపోగా.. గ్రామస్థులు అతనిని పట్టుకొని పోలీసు స్టేషన్‌కు వచ్చి పిర్యాదు చేశారు. తలమడుగు ఎస్సై ధనశ్రీ కేసు నమోదు చేసి దొంగలించబడిన స్టీలు హుండీ , నగదు రూ.7950 స్వాధీనపరుచుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ప్రచారానికి సిద్ధమవుతున్న సోయం!!

బోథ్, మార్చి 25: ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎంపీగా పోటీ చేస్తానని ప్రకటించిన ఎంపీ సోయం బాపూరావు తన ప్రచార వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. అందులో భాగంగానే ఆయన తన ఎన్నికల ప్రచార రథాన్ని సైతం సిద్ధంగా ఉంచుకున్నారు. ఆదివాసీ జెండా కింద ప్రచార పర్వాన్ని కొనసాగించనున్నారు. అందులో భాగంగానే కొమురం భీమ్ ఆశయ సాధన కోసం ఆదివాసీల హక్కుల కోసం ఎంపీగా బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. సిట్టింగ్ ఎంపీగా బీజేపీ తరఫున ఆయనకు టికెట్టు రాకపోవడంతో తీవ్రమైన నిరాశకు లోనయ్యారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బరిలో దిగ నున్నారు. ఆదివాసీల్లో మంచి పట్టు ఉన్న ఈయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే బీజేపీ అభ్యర్థి గెలుపుపై తీవ్రమైన ప్రభావం చూపనుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.



మొరాయిస్తున్న బస్సులు

అవస్థలు పడుతున్న ప్రయాణికులు



నిలిచిపోయిన ఆర్‌టీసీ అద్దె బస్సు



బస్సు నిలిచి పోవడంతో ఎండలో అవస్థలు పడుతున్న ప్రయాణీకులు (ఫైల్)

భైంసా, మార్చి 25 : లోపభూయిష్టమైన నిర్వహణ వ్యవస్థతో భైంసా డివిజన్‌లోని ఆర్‌టీసీ ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. డిపో నుంచి బస్సులు సరైన కండీషన్‌లో లేకుండానే టార్గెట్‌లకు పంపుతున్నారు. నిర్వహణ లోపంతో బస్సులు మార్గమధ్యంలో మొరాయించి నిలిచిపోతుండటంతో ప్రయాణుకులు పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న నేపథ్యంలో బస్సులు దారిలోనే నిలిచిపోతుండటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. డిపో అధికారుల నిర్లక్ష్యధోరణి విధానాలు, బాధ్యతారాహిత్య చర్యల మూలంగా సమస్యలు పెరుగుతున్నాయనే ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. భైంసా బస్సు డిపో పరిధిలో 49 అద్దె బస్సులు, 27 సంస్థ బస్సులు కలిపి మొత్తం 76 బస్సులున్నాయి. వీటిల్లో నుంచి నిత్యం ఏదో ఒక చోట ఒకటి నుంచి రెండు బస్సులు మార్గ మధ్యంలో నిలిచిపోతున్నాయనే విమర్శలున్నాయి. సోమవారం డిపో పరిధిలోని అద్దె బస్సు ఒకటి పట్టణ పరిధిలోని ప్రధాన రోడ్డు మార్గంపై మొరాయించి నిలిచిపోయింది. స్థానిక బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు బయలు దేరిన ఈ బస్సు ప్రధాన మార్గంలోని నడిరోడ్డుపై నిలిచిపోయింది. దీంతో ప్రయాణీకులు బస్సు దిగి సమీప ప్రాంతాల్లోని షాపులు ముందు,చెట్ల కింద మరో బస్సు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అంతేకాకుండా బస్సు రోడ్డు మధ్య భాగంలో నిలిచిపోవడంతో ఇతర వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఏర్పడి ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఆర్‌టీసీ ఉన్నతాధికారులు భైంసా డిపోలో బస్సుల నిర్వహణ వ్యవస్థను మెరుగుపరచి తమ సమస్యలను తొలగించాలని ప్రయాణికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



సరైన ధ్రువపత్రాలు లేకుండా డబ్బులు తరలిస్తున్న వ్యక్తితో పోలీసులు

పోలీసులు సీజ్ చేసిన డబ్బులు

బాధనకుర్తి చెక్‌పోస్ట్ వద్ద ముమ్మర తనిఖీలు

● సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో రూ. 2 లక్షలు సీజ్

ఖానాపూర్, మార్చి 25 : నిర్మల్ - జగిత్యాల జిల్లాల సరిహద్దు ప్రాంతమైన మండలంలోని బాధనకుర్తి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం పలు వాహనాలను తనిఖీ చేశారు. భూపాలపల్లి జిల్లాకు చెందిన మొగిలి శ్రీనివాస్ అనే వ్యక్తి సరైన ధ్రువపత్రాలు లేకుండా రూ. 2 లక్షలను తరలిస్తుండడంతో సదరు వ్యక్తి నుండి ఆ డబ్బులను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ. 50 వేల కంటే అదనంగా డబ్బులు తరలించేటప్పుడు ఖచ్చితమైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి, ఎస్ఎస్‌టీ ఇన్‌చార్జి సిహెచ్. ప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ ఎర్రన్న, సిబ్బంది రవీందర్, సతీష్, కుమారస్వామి, తదితరులున్నారు.

బెల్లంపానకం ధ్వంసం



బెల్లంపానకం డ్రమ్ములను ధ్వంసం చేసిన పోలీసులు

పెంచికల్‌పేట, మార్చి 25: మండలంలోని దర్గపెల్లి గ్రామ సమీపంలోని ఆటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా కోసం నిలువ చేసిన 500లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ దారుడైన మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు.

ఎల్లందు క్లబ్‌లో హోలీ వేడుకలు

మందమర్రిటౌన్, మార్చి 25: మందమర్రి లోని ఎల్లందు క్లబ్‌లో సోమవారం హోలీ పండగను సింగరేణి అధి కారులు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికిఒకరు రంగులు పూసుకుని నృత్యాలు చేశారు. అనంతరం జీఎం మనోహర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఏరియా 92శాతం ఉత్పత్తిని సాధించింద న్నారు. అదనపు ఉత్పత్తి సాధిస్తేనే ఏరియా ప్రగతి పథంలో ముందుంటుందన్నారు. లక్ష్యంలో వెనకబడి ఉన్న గనుల అధికారులు లక్ష్య సాధన కోసం కృషి చేయాలని, ప్రమాద రహిత ఉత్పత్తి చేయాలన్నారు.

కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, ఐఈడీ డీజీఎం రాజన్న, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట విషాదం..

● స్నానాలకు వెళ్లి నలుగురి మృతి
● మరణంలోనూ వీడని స్నేహబంధం
● మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు
● సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

కౌటాల, మార్చి 25: పండుగ అంటే ఉత్సాహంగా, సరదాగా జరుపుకోవాలి. అందులో హోలీ పండుగ అంటే స్నేహితుల మధ్య ఉల్లాసంగా పండుగ వాతావరణం నెలకొని ఉంటుంది. రంగులతో విరజిల్లాల్సిన నాలుగు జీవితాలు హోలీ పండుగ రోజున విషాదాన్ని నింపాయి. కౌటాల మండంలోని తాటిపల్లి గ్రామం వద్దగల వార్దానదిలో మునిగి నలుగురు యువకులు మృతిచెందిన ఘటన మండలంలో విషాదఛాయలను నిలిపాయి. కౌటాల మండలం నదీమాబాద్‌కు చెందిన కమలాకర్(23) ఉప్పుల సంతోష్(22) ఎల్కులే ప్రవీణ్(23) ఆలం సాయి(20)తో పాటు మసల సంతోష్, మేడి నవీన్‌లు కలిసి హోలీ ఆడుకుని తాటిపల్లి వార్దా నదీలో స్నానాలకు వెళ్లారు. ఇందులో మేడి నవీన్‌కు ఇంటి నుంచి ఫోన్ రావడంతో అతను ఇంటికి వెళ్లాడు. మరో స్నేహితుడు సంతోష్‌కు ఫోన్ రావడంతో అతను బయట ఫోన్ మాట్లాడుతూ ఉండిపో యాడు. వార్దా నదిలో స్నానానికి దిగిన నలుగురు ఒకరి తరువాత ఒకరు లోతు అంచనా వేయక పోవడంతో నీటిలో మునిగిఒకరిని కాపాడేందుకు పోయి ఒకరు ఇలా నలు గురు గల్లంతయ్యారు. నలుగురు స్నేహితులు నీటిలో మునిగిపోతున్న సమయంలో బయటఉన్న స్నేహితుడు సంతోష్ కాపాడండి అని కేకలు వేస్తుండగా నలుగురు నీటిలో మునిగిపోయారు. సంఘటన స్థలంలో ఉన్నవారు వెంటనే కౌటాల సీఐ సాదిక్ పాషాకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ సాదిక్‌పాషా పరిసరాలను పరిశీలించి జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు.



మృతి చెందిన యువకులు



కమలాకర్, ప్రవీణ్‌కుమార్, ఆలం సాయి, ఉప్పల సంతోష్(ఫైల్)

అనంతరం తాటిగుడ గ్రామా నికి చెందిన గజఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. మూడు గంటల తరువాత మృతదేహాలను బయటికి తీశారు. మృతిచెందిన వారిలో ఎల్కులే ప్రవీణ్‌కు వివాహంఅయి ఒక ఏడాది కుమారుడు, భార్య ఉన్నారు. మృతి చెందిన మరో ముగ్గురిలో ఉప్పుల సంతోష్ స్థానిక రైస్‌మిల్లులో ఆపరేటర్, పనాసా కమలాకర్ డ్రైవర్, ఆలం సాయి ఇటీవలే డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు.

● మిన్నంటిన కుటుంబీకుల రోధనలు

నలుగురు స్నేహితులు నీటమునిగి మృతిచెందడంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు, బంధు వుల రోధనలు పలువురిని కంటతడి పెట్టిం చాయి. నదిలో నలుగురు మునిగి చని పోయారన్న వార్త తెలియగానే ప్రజలంతా సంఘటన స్థలానికి చేరుకుని వారితో గడిపిన క్షణాలను గుర్తు చేసుకుంటూ కంటతడి పెటు్టకున్నారు. జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు సంఘ టన స్థలానికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

● సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ..

నలుగురు యువకులు నదిలో మునిగి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ కరుణాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహా లను పరిశీలించి కౌటాల సీఐ సాదిక్ పాషాను వివ రాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటా్డుతూ యువకులు సరదాలకు పోయి ప్రణాలను పోగొ ట్టుకోవద్దన్నారు. సరదా జీవితంలో ఎప్పటికీ ఉంటుందని కానీ ప్రాణం ఒక సారి పోతే తిరిగి రాదని యువకులు గమనించాలన్నారు. వారి వెంట ఎస్సై మధుకర్, ఏఎస్సై దేవిసింగ్ ఉన్నారు.







● హోలీ సంబరాల్లో పాల్గొన్న ఎస్పీ గౌస్‌ఆలం, ఎమ్మెల్యే పాయల శంకర్, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి



● జిల్లాకేంద్రంలో హోలీ సంబరాల్లో పాల్గొన్న యువతులు, మహిళలు, యువకులు

ఆనందాల.. కేళి!

- జిల్లాలో అంబరాన్నంటిన హోలీ పండుగ సంబురాలు
- చిన్నారుల కోలాహలం.. యువతీ, యువకుల కేరింతలు
- చిన్నాపెద్ద అనే తేడా లేకుండా రంగులు చల్లుకున్న ప్రజలు
- ఎమ్మెల్యే, ఎస్పీ క్యాంపు, నివాసాల్లో రంగేళి సందడి
- రంగుల పండుగ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు
- జిల్లావ్యాప్తంగా సప్తవర్ణ శోభితమైన ప్రధాన వీధులు, కూడళ్లు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 25: జిల్లాలో హోలీ పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం పట్టణంతో పాటు ఆయా మండలాల్లోని గ్రామాల్లో అన్నివర్గాల ప్రజలు హోలీ పండుగను ఆనంద కేళీగా జరుపుకున్నా రు. వాడవాడలా చిన్నాపెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఈ యేడు ఆదివారం నుంచే జిల్లాలో హోలీ పండుగ సంబరాలను రెండు రోజుల పాటు జరుపుకున్నారు. ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లాకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఎటు చూసినా రంగేళితో వాడవాడలు సందడి సందడిగా మారాయి. జిల్లాకేంద్రంలో యువకులు ర్యాలీగా తిరుగుతూ రంగులతో వేడుకలు జరుపుకున్నారు. కాగా, జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు రంగేలి కార్యక్రమంలో పాల్గొని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలంకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఎమ్మెల్యే పాయల శంకర్‌కు పార్టీ నాయకులు, నేతలు పలువురు కార్యకర్తలు, అభిమానులు ఆయన నివాసంలో రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి జోగు రామన్న నివాసంలో కూడా హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో పాటు నాయకులు, కార్యకర్తలు హోలీ శుభాకాంక్షలు తెలిపి రంగులు పూసారు. దీంతో జిల్లావ్యాప్తంగా హోలీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. జిల్లా అంతటా ఎటు చూసినా రంగుల మయంగా మారిపోయింది.

ప్రతీఒక్కరి జీవితం రంగులమయం

హోలీ పండుగ రంగుల కలయికలా ప్రతిఒక్కరీ జీవితాలు కూడా రంగుల మయంగా మారాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. హోలీ పండుగ సందర్భంగా సోమవారం ఆయన నివాసంలో పార్టీ శ్రేణులు, మార్నింగ్ వాకర్స్ గ్రూప్ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు రంగులను పూసి ఆయనతో కలిసి నృత్యాలు చేశారు. అంతకుముందు మార్నింగ్ వాకర్స్ సభ్యులు నృత్యాలు చేస్తూ ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ రంగుల కలయికల ప్రతీఒక్కరి జీవితంలో రంగులమయంగా మారాలని ఆకాంక్షించారు. కుల మతాలకు అతీతంగా ప్రతీఒక్కరు హోలీ పండుగను పెద్దఎత్తున జరుపుకోవడం సంతోషం గా ఉందన్నారు. వచ్చే పండుగలను కూడా ఇలానే సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఇదిలా ఉంటే అటు ఎమ్మెల్యే పాయల శంకర్ నివాసంలో పార్టీ శ్రేణులు హోలీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు రంగులను పూసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే హోలీ వేడుకల్లో పాల్గొని నృత్యాలు చేస్తూ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ గ్రూప్ సభ్యులు, తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మేకల మల్లన్న, భరత్ వాఘ్మారే, కొండ గంగాధర్, గోవర్ధన్‌రెడ్డి, ఎలుగు సంజీవ్, డేగ కృష్ణారెడ్డి, నాందేవ్ గౌడ్, ఆకుల ప్రవీణ్, రాజేశ్, లాలామున్న, కృష్ణ యాదవ్, బన్ని, సాయి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

మరోపక్క పట్టణంలో కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కంది శ్రీనివాస్‌కు రంగులు పూసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పండుగను పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల మధ్య హోలీ

ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం కోరారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో పోలీసులతో ఎస్పీ హోలీ వేడుకలను జరుపుకున్నారు. డీజేసౌండ్, బ్యాండ్‌మేళా మధ్య పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి నృత్యాలు చేస్తూ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ రంగుల పండుగనే హోలీ అని తెలిపారు. సహజ సిద్ధమైన రంగులను హోలీ లో ప్రజలు వినియోగించాలని కోరారు. అదేవిధంగా ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా పండుగలను జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు సత్యనారాయణ, ప్రదీప్‌కుమార్, సీసీ దుర్గంశ్రీనివాస్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



● వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాపు రావు, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



ఏజెన్సీలో ఘనంగా హోలీ పండుగ

ఉట్నూర్, మార్చి 25: ప్రతియేటా ఫాల్గుణ మాసంలో పౌర్ణమి రోజు వసంత రుతువు రాకతో వచ్చే తొలి పండుగ హోలీ పండుగను సోమవారం ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లో సోమవారం ఉదయం నుంచి దూలండి రంగులతో పండుగ నిర్వహించుకున్నారు. ప్రజలందరూ సుఖం, దుఖం, సంతోషం, విచారం అనే రంగులన్నీ కలిసి చేసే కోలాహలమైన, సప్తవర్ణాల శోభితమైన హోలీ పండుగ అందరి జీవితాలలో ఆనంద పరిమళాలను నింపాలని, అందరి జీవితాలలో సుఖ, శాంతి, సౌభాగ్య విజయాలు కలగాలని, అలాగే ఈ రంగుల వసంతోత్సవం కొత్త ఉత్తేజాన్ని నింపాలని కోరుకున్నారు. ఆ తర్వాత స్నేహితుల ఇళ్లకు చేరుకుని రంగులు వేస్తూ స్నేహబంధాన్ని పెంచుకున్నారు. ఉట్నూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ నివాసానికి అభిమానులు తరలివచ్చి రంగులు వేశారు. అదేవిధంగా ఎల్బీనగర్‌లోని ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీమ్‌రావు ఇంటికి అభిమానులు తరలి రావడంతో ఆయన వారితో కలిసి నృత్యాలు చేశారు. ఘన్‌పూర్‌లో ఎంపీపీ పంద్ర జైవంతరావు ఆధ్వర్యంలో గిరిజనులు హోలీ పండుగను నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని బీజేపీ నాయకులు జడ్పీ చైర్మన్ ఇంటికి చేరుకుని కొండేరి రమేష్ ఆధ్వర్యంలో హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

● సొంత గ్రామంలో ఎమ్మెల్యే రంగుల కేళి

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సోమవారం రంగుల పండుగను తన స్వగ్రామమైన ఉట్నూర్ మండలంలోని కల్లూరుగూడలో అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆయన హోలీ పండుగను జరుపుకున్నారు. కాగా, అభిమానులు అక్కడికి వెళ్లి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



● ఉట్నూర్ మండలం కల్లూరుగూడలో కుటుంబ సభ్యులతో కలిసి హోలీ పండుగను జరుపుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్



● నేరడిగొండలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నివాసం వద్ద హోలీ సంబరాల్లో పాల్గొన్న మహిళలు, నాయకులు

నేరడిగొండ: మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో సోమవారం హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇంట స్థానిక నాయకులు ఎంపీపీ రాథోడ్‌సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నానక్‌సింగ్ తదితరులు ఎమ్మెల్యేకు రంగుపూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద సంప్రదాయ నృత్యాలు చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా సంబరాల్లో పాల్గొన్నారు.

సిరికొండ రూరల్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిరికొండ మండలకేంద్రంతో పాటు సుంకిడి, పొన్న, వాయిపేట్, కుంటగూడ, సోంపెల్లి, ధర్మాసాగర్, రిమ్మ, కన్నాపూర్, తదితర గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ సహజసిద్ధమైన రంగులను చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బజార్‌హత్నూర్: మండలం పరిధిలోని గ్రామాలలో యువకులు, పెద్దలు, గ్రామస్థులు సోమవారం ఘనంగా హోలీ పండుగను జరుపుకున్నారు. దీనిలో భాగంగా చిన్నారులు ఉదయం నుంచే రంగులు ఒకరిపై మరొకరు చల్లుకుంటూ హోలీని నిర్వహించుకున్నారు. కాగా, ఒక్క రోజు ముందు కామదహనం చేసిన తర్వాత.. మరుసటి రోజు హోలీ పండుగను నిర్వహించుకుంటారు. చిన్నలు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతీఒక్కరు హుశారుగా హోలీ వేడుకలలో పాల్గొన్నారు.



ఘన్‌పూర్‌లో హోలీ ఆడుతున్న ఎంపీపీ జైవంత్‌రావు



బజార్‌హత్నూర్‌లో యువకుల సందడి



సిరికొండలో హోలీ సంబరాల్లో పాల్గొన్న యువకులు



కరంజి(టి)లో యాత్రికులను వీడ్కోలు పలుకుతున్న గ్రామస్థులు

పండరీపూర్‌కు భక్తుల పాదయాత్ర

భీంపూర్, మార్చి 25: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా వాడ గ్రామానికి చెందిన 60 మంది, అదే జిల్లాకు చెందిన డకోరి గ్రామానికి చెందిన 50 మంది పండరీపూర్ పాదయాత్రగా బయలుదేరారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భీంపూర్ మండలం కరంజి(టి) రామాలయ ఆవరణలో ఆశ్రయం పొంది భజన కీర్తనలు చేశారు. తరువాత సోమవారం ఉదయం గ్రామస్థులు ఈ యాత్రికులకు డప్పు వాయిద్యాలతో వీడ్కోలు పలికారు. కాగా ఈ బృందంలోని సమర్థ చైతన్య మహారాజ్ పాదయాత్రలో ఉన్నప్పుడు ఒక గోవు అతని వద్దకు రాగా మహారాజ్ గోవు పాలు తాగిన దృశ్యం చూసి భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు.

బెల్సారి రాంపూర్‌లో దేశిదారు పట్టివేత

భీంపూర్, మార్చి 25: మండలంలోని బెల్సారి రాంపూర్‌లో ఆదివారం రాత్రి భీంపూర్ పోలీసులు సంతోష్, జైరాం అనే వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశారు. వారి వద్ద అ క్రమంగా నిల్వ ఉంచిన రూ.10 వేల విలువ గల మహారాష్ట్ర దేశిదారు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ దాడిలలోజైనథ్‌తో పాటు ఏఎస్సై ముంతాజ్, సిబ్బంది శివాజీ, స్వామి ఉన్నారు.



పట్టుకున్న మద్యంతో భీంపూర్ పోలీసులు

బజార్‌హత్నూర్‌లో అలరించిన కుస్తీ పోటీలు

● పెద్దసంఖ్యలో తరలివచ్చిన మల్లయోధులు

బజార్‌హత్నూర్, మార్చి 25: మండలకేంద్రంలో హోలీ పండుగను పురస్కరించుకుని గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు మండలవాసులను అలరించాయి. దాదాపుగా ఎన్నో దశాబ్దాల నుంచి హోలీ పండగను పురస్కరించుకుని ఈ కుస్తీ పోటీలను నిర్వహించడం తరతరాలుగా ఆచారంగా వస్తుంది. దీంతో ప్రతీ సంవత్సరం లాగానే ఈ రోజు కూడా గ్రామపెద్దల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను గ్రామస్థులు నిర్వహించారు. ఈ పోటీలలో తలపడడానికి మహారాష్ట్ర, కిన్వట్, నాందెడ్, పర్బని, నాగ్‌పూర్ నుంచి మల్లయోధులు తరలివచ్చారు. మొదటి కుస్తీ పోటీలు కొబ్బరికాయలు బహుమతి నుంచి ప్రారంభమై.. రూ. పది వేల బహుమతి వరకు కుస్తీ పోటీలను నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులను ప్రదానం చేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు చట్ల గజ్జయ్య, చట్ల నందుకుమార్, మాజజి సర్పంచ్ పర్ప సాయన్న, ఉప సర్పంచ్ చట్ల విలాస్, చట్ల వినీల్, దీసి రమణ, తదితరులు పాల్గొన్నారు.



కుస్తీ పోటీలలో తలపడుతున్న మల్లయోధులు

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
ఇఫ్తార్	సహర్
సా.6.34	ఉ.4.53



అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు.. సకల విషయాలు తెలిసిన వాడు.